# భావిపౌరుడు

— పాండురి

రవి వ్రాసిన ఉత్తరం చదివి వెంటనే వరంగల్ పోవడానికి నిర్ణయించుకొని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాను. కాకతీయ ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా వస్తుందని అనౌన్సర్ ప్రకటించడంతో చిరాకేసి బుక్‌స్టాల్‌కెల్లి ఓ మయూరి వారపత్రిక కొనుక్కొని నిరీక్షించసాగాను. చివరకు ఇంకో అరగంట ఆలస్యంగా ట్రెయిన్ ప్లాట్‌ఫారం మీదకు వచ్చినందుకు మొదట రైల్వే డిపార్టుమెంటుని తిట్టుకున్నా, రైలొచ్చింది కదా అదే పదివేలు అనుకొని ఎక్కి కూర్చున్నాను.

రవి, నామధ్య స్నేహం గత పదేళ్లుగా కొనసాగుతుంది. అతను నేను కలసి చదివింది సిటీలోనే అయినా ఉద్యోగం మా ఇద్దర్ని వేరు చేసింది. నేను హైదరాబాద్‌లో సెటిల్ అయ్యాను. వాడు వరంగల్‌లో రివెన్యు డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు. నా ఆకస్మిక ప్రయాణానికి కారణం వాడి పెళ్లి. స్వయంగా వచ్చేందుకు వీలులేదని ఉత్తరం ద్వారా తెలియజేశాడు. అమ్మాయి బి.ఎ. వరకు చదువుకుందట. లక్షాయాభైవేల కట్నం ఎంతైనా రవి అదృష్ట జాతకుడు అనుకుంటుండగానే రైలు కూతేసి కదిలింది. దాని వేగంతో సమానంగా కాలేజి రోజుల్లో మేము చేసిన చిలిపి పనులు ఒక్కటొక్కటే జ్ఞాపకం రాసాగాయి. అరగంటలో ట్రైన్ భువనగిరికి చేరుకుంది. ఒక్కసారిగా కాఫీ, పల్లీలు, సోడాలు అమ్మేవారు మేము శత్రువుల్లా కన్పించినట్లు, మా మీద దాడి చేశారు. రెండు నిముషాల తర్వాత ఓ పదేళ్ల అబ్బాయ్ నేకూచున్న కిటికి దగ్గరకొచ్చి "సార్ సోడా కావాలి" అని అడిగాడు.

అతని చిరిగిన దుస్తులు, చింపిరి జుట్టు, చేతిలో ఓ ట్రంక్‌పెట్టె దాని నిండా సోడా సీసాలు, అతని స్థితి గమనించేసరికి నా హృదయంలో ఎక్కడో కెలికినట్లయింది. అతని తల్లిదండ్రులు ఎంత దీనావస్థలో ఉన్నారేమో పాపం అనుకొని నాకు సోడా తాగాలని లేకున్న వాడికి బేరం రావాలని "బాబు ఎంత" అని అడిగాను.

"ముప్పై పైసలు సార్."

పర్సు వెతికాను. అన్ని పదిరూపాయల నోట్లు తప్ప చిల్లర లేదు. సరే కుర్రాడు తెచ్చిస్తాడులే అనుకొని ఆనోటు అతనికిచ్చి సోడా త్రాగాను.

"రైలు కదలడానికింకా ఇరువై నిముషాలుంది సార్ నేనిప్పుడే చిల్లర తెచ్చిస్తాను" అనుకుంటూ వెళ్లాడు.

పది నిముషాలు గడిచింది. ఆ కుర్రాడు ఇంకా రాకపోయేసరికి నాలో అనుమానం చెలరేగింది. కొంపదీసి వాడు అటునుంచి అటే వెళ్లిపోయాడా అన్న సంశయం కల్గింది. నాకళ్లు వాడి కొరకై వెదికాయి. రైలు మొదటికూతేసింది. సరిగ్గా అదే సమయంలో ఆ కుర్రాడు ప్రక్కబోగి కిటికి వద్ద సోడా అమ్ముతూ కన్పించాడు.

"ఏయ్ అబ్బాయ్ ఇటురా" అని పిలిచాను.

"ఏం సార్ సోడా కావాలా" కొత్తగా ప్రశ్నించాడు.

"కాదోయ్ నా చిల్లర డబ్బులు"

"ఎక్కడివి సార్ మీకు డబ్బులు" అని అంటున్న ఆ కుర్ర వెధవని చూసి అవాక్కయిపోయాను. నేను మరో మాట మాట్లాడకుండా రైలు వేగం పుంజుకుంది.

రైలు ప్రయాణాలలో నా అనుభవమంతలేదు వాడి వయస్సు. అలాంటి కుర్రవెధవ నన్ను




నిముషంలో ఫూల్‌ని చేసాడు. వాడివేపు తదేకంగా చూస్తూ "వీడేనా మనదేశ భావిపౌరుడు" అని బాధపడసాగాను.

